సాక్షి
రంగారెడ్డి
సోమవారం ı 14 ı ఏప్రిల్ ı 2025



ఇబ్బంది పెడితే ఊరుకోం

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 8లో▸



చెరువుల పరిరక్షణ

చెరువుల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸



రాజ్యాంగ స్ఫూర్తిని..

దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి ఆరోపించారు. 8లో▸

న్యూస్‌రీల్

విద్యారంగ పరిరక్షణకు కృషి

యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య



సదస్సులో మాట్లాడుతున్న జంగయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యారంగం అభివృద్ధి, పరిరక్షణ కోసం టీఎస్ యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య పేర్కొన్నారు. సంఘం 12వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సెమినార్‌లో మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి నిరంతరం పోరాడుతున్న సంఘం యూటీఎఫ్ మాత్రమేనని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని వచ్చే జూన్ లో బడిబాట, కళాజాత నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదరణ లభించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బి.రాములయ్య, కోశాధికారి జగన్నాథ శర్మ, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ కిషన్ చౌహాన్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుగంధ, సీనియర్ నాయకులు నాగేంద్రం, ఆయా మండలాల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటి బకెట్‌లో పడి బాలుడి దుర్మరణం



అద్యుత్ (ఫైల్)

నందిగామ: ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న బాలుడు నీటి బకెట్‌లో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చేగూరులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటాచారి కుమారుడు అద్యుత్ (15 నెలలు) ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నాడు. ప్రమాదవశాత్తు అక్కడే నీటితో నిండి ఉన్న బకెట్‌లో పడిపోయాడు. అదే సమయంలో బయట నుంచి వచ్చి చూసిన తండ్రి వెంటనే సమీపంలోని కన్హా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అప్పటిదాక బుడిబుడి అడుగులతో సందడి చేసిన బాలుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

అంబేడ్కర్ జయంతి సందర్భంగా భారీ ఏర్పాట్లు

సాక్షి, సిటీబ్యూరో: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా హెచ్ఎండీఏ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. నెక్లెస్ రోడ్డులోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ పరిసరాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా అంబేడ్కర్ సిద్ధాంతాలను, ఆలోచనలను భావితరాలకు పరిచయం చేసేలా వినూత్నమైన కళా ప్రదర్శన నిర్వహించనున్నారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రూపొందిన ఈ ప్రదర్శనలో యువత తన కళాత్మకతను, సృజనాత్మకతను సమున్నతంగా ఆవిష్కరించనుంది. అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా సమానత్వం, సామాజిక న్యాయం, సాధికారత వంటి అంశాలను ప్రతింబింబించేలా ప్రముఖ ఫైన్ ఆర్ట్స్, ఆర్కిటెక్చర్ విద్యా సంస్థలకు చెందిన 90 మంది విద్యార్థులు రూపొందించిన అనేక రకాల కళాకృతులను ప్రదర్శించనున్నారు.

ప్రాణం తీసిన తనిఖీల భయం

- ట్రాఫిక్ పోలీసులను చూసి.. బైక్ వెనక్కి మళ్లించి వెళ్తుండగా ప్రమాదం



జోషిబాబు (ఫైల్)

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి తన బైక్‌ను వేగంగా వెనక్కి మళ్లించి వేగంగా వెళ్లే క్రమంలో ఆర్టీసీ బస్సు కింద పడి మృతి చెందిన ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ నరసింహ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. షాపూర్ నగర్‌లో నివసించే జోషిబాబు (35) కార్పెంటర్ పని చేస్తున్నాడు. జీడిమెట్ల నుంచి బాలానగర్ వైపు వస్తున్న క్రమంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. వీరిని చూసి భయపడి తిరిగి వేగంగా వెనక్కి వెళ్లే క్రమంలో తన ద్విచక్ర వాహనం పడిపోయింది. దీంతో అతని తలపై నుంచి ఆర్టీసీ దూసుపోయింది. తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బాలానగర్ పోలీసులు తెలిపారు.

ఆరోగ్యమే లక్ష్యం

అంగన్‌వాడీల్లో 'పోషణ పక్షం'

- ఈనెల 22వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- ఆరోగ్య సంరక్షణే అంతిమ ధ్యేయం
- రక్తహీనత నివారణకు చర్యలు
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన



ఆరోగ్యంపై చిన్నారులు, బాలింతలకు అవగాహన (ఫైల్)

షాద్‌నగర్: పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారు. సమతుల ఆహారంతో రోగ నిరోధకశక్తి పెరిగి ఆరోగ్యంగా జీవించగలుగుతారు. నిరుపేద కుటుంబాల్లో చాలా మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీల్లో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా..

చిన్నారులు, గర్భిణులు, మహిళల్లో రక్తహీనతను అధిగమించే ఉద్దేశంతో పోషణ పక్షం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. హెల్ప్‌లైన్‌ను సైతం ఏర్పాటు చేసింది. పౌష్టికాహార లోపం ఏ గ్రామంలో కనిపించకూడనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

చేపట్టే కార్యక్రమాలివీ..

- శిశువు జన్మించిన మొదటి వెయ్యి రోజులపై ప్రత్యేక దృష్టి అనే థీమ్ ప్రామాణికంగా కార్యక్రమాలు కొనసాగుతాయి.
- పోషకాహార లోపాన్ని నివారించడమే లక్ష్యం.
- రోజుకో కార్యక్రమం చొప్పున ఈ నెల 8 నుంచి ప్రారంభమైన కార్యక్రమాల ఈనెల 21వరకు కనసాగుతాయి.
- 14న అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు కోసం పోస్టర్లు, బ్యానర్ల ప్రదర్శన.
- 15న అతి తీవ్ర పోషణ లోపం కలిగి ఉన్న పిల్లలను ముందుగా గుర్తించడం.
- 16న పోషణ జాతరలో భాగంగా వంట ప్రదర్శనలు, ఆరోగ్య పరీక్షలు.
- 17న ఆకలి పరీక్షల నిర్వహణ.
- 18న పౌష్టికాహారం, రోజువారీ వ్యాయామంపై తల్లిదండ్రులకు అవగాహన.
- 19న కేంద్రాల్లో పండ్లు, కూరగాయల దినోత్సవం నిర్వహణ.
- 20న పాఠశాల విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన పోటీలు.
- 21న దేశీయ బొమ్మలను ప్రోత్సహించే కార్యక్రమాలు
- 22న పూర్వ ప్రాథమిక విద్య సంసిద్ధత, గ్రాడ్యుయేషన్ డే నిర్వహణ.

అందరి భాగస్వామ్యంతో..

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అందరినీ భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో మహిళా, శిశు సంక్షేమ అధికారులు కృషి చేస్తు న్నారు. ఇందులో అంగన్‌వాడీ సిబ్బందితో పాటు వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, వ్యవసాయ శాఖల అధికారులను భాగస్వాములను చేస్తున్నారు.

రోజుకో కార్యక్రమం



చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికల్లో పోషణ లోపం నివారణే లక్ష్యంగా పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రోజుకో కార్యక్రమం చొప్పున పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– షబానా బేగం, సీడీపీఓ, షాద్‌నగర్



చిలుకూరు ఆలయ పురవీధుల్లో స్వామివారి దివ్యరథోత్సవం

అశ్వ వాహనంపై బాలాజీ

- వైభవంగా రథోత్సవం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు అశ్వ వాహనంపై ఊరేగారు. ఆలయంలో మహాభిషేకం, ఆస్థాన సేవ, దోప్‌సేవ, పుష్పాంజలి సేవలు అందించారు. వేదపండితుల మంత్రోశ్చరణలు.. భక్తుల గోవింద నామస్మరణలు.. డోలు, డప్పు వాయిద్యాల మధ్య చిలుకూరు బాలాజీ దివ్యరథోత్సవం నేత్రపర్వంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామి వారి దివ్యరథోత్సవం శనివారం అర్ధరాత్రి కనుల పండువగా సాగింది. వేంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి సమేతంగా రథంపై ఆసీనులై దేవాలయం చుట్టూ ఊరేగారు. శ్రీదేవి, భూదేవిలను వివాహం చేసుకున్న స్వామివారు వారిని గ్రామస్తులకు చూపించే క్రమంలోనే రథోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకుడు రంగరాజన్ భక్తులకు వివరించారు. రాత్రి 11 గంటలకు స్వామివారు, అమ్మవార్లకు అద్దాలమహల్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా తీసుకొచ్చారు. రథం చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొదటి అంతస్తులో ఆసీనులను చేశారు. రథం ముందు అర్చకులు హోమం నిర్వహించారు. అనంతరం అర్చకులు, భక్తులు పెద్ద ఎత్తున గోవిందనామస్మరణ చేస్తూ రథాన్ని ముందుకు కదిలించారు. స్వామి వారి రథోత్సవంలో పాల్గొనటంతోపాటు రథాన్ని తాకితే అంతా మంచి జరుగుతుందన్న విశ్వాసంతో భక్తులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో కన్వీనర్ గోపాలకృష్ణ స్వామి, తిరుమల కిరణాచారి, పరావస్తు రామాచారి, నరసింహం కన్నయ్య, కిట్టు, మురళి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హక్కుల సాధనకు పోరాడుదాం

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు

షాద్‌నగర్: హక్కుల సాధనకు కార్మికులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. పట్టణంలోని యమ్మి హోటల్‌లో ఆదివారం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఈ నెల 21, 22వ తేదీల్లో శంషాబాద్‌లో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీను, చంద్రబాబు, లింగంనాయక్, గోవింద్ నాయక్, జంగయ్య, రమేశ్, రాజునాయక్, శంకర్, పవన్ చౌహాన్, ఆకాశ్ పాల్గొన్నారు.

వలస కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

కొత్తూరు: జీవనోపాధి కోసం ఆయా రాష్ట్రాల నుంచి షాద్‌నగర్‌కు వచ్చిన వలస కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి పానుగంటి పర్వతాలు కోరారు. కొత్తూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఈ నెల 21, 22న శంషాబాద్‌లో నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయా రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులను పరిశ్రమల నిర్వాహకులు, కాంట్రాక్టర్లు శ్రమ దోపిడీకి గురిచేస్తున్నట్లు ఆరోపించారు. వెంటనే ప్రభుత్వాలు స్పందించి వలస, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, శేఖర్‌రెడ్డి, షకీల్, జంగయ్య, సంజీవ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు నెత్తిన.. విత్తన భారం



- పత్తి విత్తన ప్యాకెట్ల ధరలు పెంచిన కంపెనీలు
- ఇప్పటికే పెట్టుబడి ఖర్చులు తడిసి మోపెడు
- మరింతగా పడనున్న ఆర్థిక భారం
- ఆందోళనలో అన్నదాతలు

షాబాద్: పత్తి రైతుపై ధరల పిడుగు పడింది. రానున్న వర్షాకాలం ప్రారంభానికి ముందే విత్తన కంపెనీలు అమాంతం ధరలు పెంచేశాయి. దీంతో ఇప్పటికే అతివృష్టి, అనావృష్టితో నష్టాలు చవిచూస్తున్న రైతులపై ఆర్థిక భారం మరింత పడనుంది. దీంతో పత్తి సాగువైపు ఈసారి రైతులు మొగ్గు చూపుతారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవైపు పెరుగుతున్న ధరలు.. మరోవైపు నకిలీ విత్తనాల బెడద కంటికి కునుకు లేకుండా చేస్తోంది.

ఏటా ధరల దడ

ఏటా పత్తి సాగుకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. విత్తనాలు, పురుగు మందులకు రూ.వేలల్లో వెచ్చించాల్సి వస్తోంది. దీనికి తోడు కూలీల ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు కలుపుతీత కోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది. విత్తన కంపెనీలు ఏటా ధరలు పెంచుతుండడంతో మరింత భారం పడుతోంది. బీటీ పత్తి విత్తనాల ధర ఆరేళ్లుగా పెరుగుతూ వస్తోంది. 2019లో ప్యాకెట్ ధర రూ.710 ఉండగా ప్రస్తుతం రూ.901కి చేరింది.

తగ్గుతున్న పంట దిగుబడి

పత్తి పంట వేసిన నాటి నుంచి చేతికొచ్చే వరకు రైతులకు ఆందోళన తప్పడం లేదు. సరైన సమయానికి వర్షాలు పడకపోవడం.. పూత, కాత సమయంలో ఎక్కువగా పడటం తదితర కారణాలతో పంట దిగుబడులపై ప్రభావం చూపుతోంది. చేతికొచ్చిన పంట తీసే సమయంలో కూలీలు దొరక్క నేల రాలి దిగుబడి తక్కువగా వస్తోంది.

పెరుగుతున్న పెట్టుబడి

పత్తి పంట సాగు చేసేందుకు ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల ఖర్చు వస్తోంది. దుక్కి దున్నడం నాటి నుంచి భూమిని చదును చేయడం, విత్తనాలు వేయడం, కలుపు, మందుల పిచికారీ, పత్తి తీత కూలీ ఖర్చులు ఉంటాయి. ఎకరాకు రెండు ప్యాకెట్ల విత్తనాలు అవసరం ఉంటుందని రైతులు చెబుతున్నారు. గతేడాది బీటీ–2 పత్తి విత్తనం 475 గ్రాముల ప్యాకెట్ ధర రూ.867 ఉండగా ఈ ఏడాది రూ.901కి పెరిగింది. ఆయా కంపెనీలు అన్ని రకాల విత్తనాల ధరలు పెంచేశాయి. అంతకంతకూ పెరుగుతున్న పెట్టుబడులతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



పత్తి విత్తనాలు వేస్తున్న రైతులు (ఫైల్)

ఖర్చులు పెరిగాయి



ప్రతీ సంవత్సరం పత్తి పంట సాగు చేసేందుకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. ఎకరాకు సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేల దాకా ఖర్చు వస్తోంది. విత్తనాల ప్యాకెట్ల ధరల పెంపుతో మరింత భారం పడుతోంది. ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– విజయభాస్కర్‌రెడ్డి, రైతు, మరియాపురం

ధరలు తగ్గించాలి



పత్తి విత్తనాల ధరలను ఏటా పెంచుతుండంతో ఆర్థిక భారం పడుతోంది. పెంచిన ధరలను కంపెనీలు వెంటనే తగ్గించాలి. లేదంటే ప్రభుత్వం రాయితీ ఇవ్వాలి. విత్తనాల కొనుగోలు నుంచి చేతికొచ్చిన పంట అమ్మే దాకా రైతుల చేతిలో ఏదీ ఉండడం లేదు.

– నర్సింహారెడ్డి, రైతు, మన్‌మర్రి

కడుపులో పొడిచి.. గొంతుకోసి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


గుర్తు తెలియని యువకుడి దారుణ హత్య

షాద్‌నగర్: గుర్తు తెలియని యువకుడిని కత్తితో కడుపులో పొడిచి, గొంతుకోసి దారుణంగా హత మార్చారు. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ శివారులో చోటు చేసుకుంది. పట్టణ సీఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని యువకుడిని (30)ని కొందరు దుండగులు శనివారం అర్ధరాత్రి ఎంఎస్ఎన్ పరిశ్రమ సమీపంలోని జాతీయ రహదారి పక్కకు తీసుకువచ్చారు. కత్తితో కడుపులో పొడిచి, గొంతు కోసి పరారయ్యారు. సమాచారం అందుకున్న ఏసీపీ రంగస్వామి పట్టణ సీఐ విజయ్‌కుమార్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. మృతుడి శరీరంపై నలుపు రంగు కార్గో ప్యాంటు, నీలం రంగు షర్టు ఉన్నాయి. మెడలో వేంకటేశ్వరస్వామి లాకెట్‌తో పసుపు, ఎరుపు రంగు దారం దండ ఉంది. ఛాతి ఎడమ వైపున పచ్చబొట్టు, కుడి చేతిపై జై బాలయ్య పేరుతో పచ్చబొట్టు ఉన్నాయి. హత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినవారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని సీఐ విజయ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పాలనతో జనం విసిగిపోయారు

ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని సార్లరావులపల్లిలో ఆదివారం మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్‌తో కలిసి నూతనంగా నిర్మించిన శ్రీపెద్దమ్మ తల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి విధివిధానాలు లేకుండా సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఫార్మాసిటీ కోసం 14 వేల ఎకరాలు సేకరించారని, ఆ భూముల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి ఫ్యూచర్‌సిటీ, ఫోర్త్‌సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. అందులో ఎలాంటి పనులు చేపట్టకుండానే అదనంగా భూసేకరణ చేయడం ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలోనే ఫార్మాసిటీలోకి నేరుగా చేరుకునేలా కొత్తూరు గేట్ నుంచి 200 అడుగుల విస్తీర్ణంతో రహదారిని నిర్మించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ రహదారి పేరుతో ఈ ప్రాంతంలోని విలువైన భూములను అమ్ముకోవడానికి చూస్తోందని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో గ్రామాలను విడదీస్తూ ప్రజలను గందరగోళంలోకి నెట్టారన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేసేలా శ్రేణులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. కేంద్రం నిర్మిస్తున్న ట్రిబుల్‌ఆర్ రోడ్డు తూర్పు భాగంలో కేసీఆర్ హయాంలో రాజకీయాలకు అతీతంగా భూసేకరణ చేశారన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి తన సొంత ప్రయోజనాల కోసం రోడ్డును మరింత దూరం పెంచుతూ పోతున్నారని విమర్శించారు. రావిర్యాల ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి నిర్మించతలపెట్టిన 330 అడుగుల ఫ్యూచర్‌సిటీ గ్రీన్ ఫీల్డ్ రహదారిని విరమించుకోవాలన్నారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథనాయక్, మాజీ సర్పంచ్ రజితప్రవీణ్‌నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఇందిర, సురేష్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.మేఘనాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సీఎస్ఆర్ నిధులతో చెరువుల పరిరక్షణ



చెరువు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: చెరువుల పరిరక్షణకు పారిశ్రామిక దిగ్గజాలు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఆయన అమెజాన్, సేట్రీస్ సంస్థల సహకారంతో కొత్తూరు పట్టణంలో చేపట్టనున్న సాయిరెడ్డి చెరువు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెంపునకు బహుళజాతి పరిశ్రమలు అనుసరిస్తున్న విధానం సంతోషకరమన్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లోకి భారీ వర్షాలు కురిసినప్పటికీ వివిధ కారణాల వల్ల వరద నీరు చేరడం లేదన్నారు. మరికొన్ని చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం చాలా వరకు తగ్గిందన్నారు. దీంతో భూగర్భ జలాలు త్వరగా అడుగంటుతున్నాయని వివరించారు. బహుళజాతి పరిశ్రమలు సీఎస్ఆర్ నిధులతో చెరువుల పరిరక్షణతో పాటు భూగర్భ జలాల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు భవిష్యత్‌లో సత్ఫలితాలిస్తాయన్నారు. అభివృద్ధి పనులు చేపట్టే సంస్థలకు రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని కోరారు. కొత్తూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సేట్రీస్ సంస్థ సీఈఓ దేవకాంత్, ప్రతినిధులు అమరేందర్, సురేశ్, షహనాజ్ అన్సారీ, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, హరినాథ్‌రెడ్డి, దేవేందర్‌యాదవ్, శ్రీను, గోవింద్‌నాయక్, సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19 నుంచి రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అధ్యాపకులు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ఆదివారం నిజాం కాలేజీ అధ్యాపకుడు డా.వేల్పుల కుమార్ అధ్యక్షతన సమావేశమైన కాంట్రాక్టు అధ్యాపకులు అనేక సమస్యలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల పర్మనెంట్ విషయంతో గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. వర్సిటీలలో అధ్యాపకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌కు ముందే కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనానికి 27 ఏళ్లుగా పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల్లో పేర్కొన్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని, లేని పక్షంలో నిరవధికంగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు హెచ్చరించారు. అనంతరం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. వర్సిటీలలో 15న సమ్మె నోటీసు సమర్పించి ధర్నా, 16, 17 తేదీలలో ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా, 19 నుంచి నిరవధిక సమ్మెతో సమస్యలను ప్రజలు, ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు ధర్మతేజ, ఉపేందర్, విజేందర్ రెడ్డి, వెంకటేష్, రమేశ్వర్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలు.. అప్రమత్తత మేలు

- చెట్ల కిందకు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి
- ఉరుములు, మెరుపులు చూసేందుకు యత్నించొద్దు

షాబాద్: అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఆకాశం మేఘావృతమై, బలమైన ఈదురుగాలులతో మెరుపులతో కూడిన పెద్ద శబ్దాలతో పిడుగులు పడతాయి. వీటికి బలమైన అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. దీంతో వీటి ప్రభావంతో మనుషులతో పాటు జంతువులు మృత్యువాత పడుతున్నాయి. పిగుడుల ప్రభావానికి పచ్చని చెట్లు సైతం కాలిపోతుంటాయి.

పిడుగు అంటే...?

మేఘాల్లో ఉష్ణోగ్రత తక్కువగా ఉండటం వల్ల వర్షపు నీరు చిన్న మంచు కణాలుగా విడిపోతుంది. ఈదురు గాలులకు వాటి మధ్య రాపిడి జరిగి, ఇందులోని పాజిటివ్ కణాలు తేలికగా ఉండటం వల్ల మేఘాల పైకి వెళ్తుంటే, నెగెటివ్ కణాలు బరువుగా ఉండి కిందికి వెళ్తుంటాయి. ఈ క్రమంలో పాజిటివ్, నెగెటివ్ కణాలు ఆకర్షించుకొని మెరుపులు వస్తాయి. ఈ సమయంలో మేఘంలోని నెగిటివ్ కణాలు, భూమిలోని పాజిటివ్ కణాలను ఆకర్షిస్తుంటాయి. అప్పుడు భూమిపై ఎత్తుగా ఉండే చెట్లు, గుట్టలు, మనుషులపై పిడుగు పడుతుంది.



మన్‌మర్రిలో పిడుగుపాటుకు మృతి చెందిన పశువులు(ఫైల్)

బయటకు వెళ్లొద్దు

వర్షాలు పడే సమయంలో బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం. వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు, రైతు కూలీలు ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కిందకు, విద్యుత్ టవర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోకి వెళ్లొద్దు. పిడుగుపడే సమయంలో ఆకాశంలోని మెరుపులు అత్యధిక శక్తిని కలిగి ఉంటాయి. ఆ వెలుతురును చూసేందుకు ప్రయత్నించొవద్దు. పిడుగుకు కొన్ని మిలియన్ మెగావాట్ల శక్తి ఉంటుందనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

సమయస్ఫూర్తి అవసరం

వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి, రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. వీలు కాకపోతే సమయస్ఫూర్తితో వ్యవహరించి, మోకాళ్లపై చేతులు, తలపెట్టి, దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. దీంతో సమీపంలో పిడుగు పడినా అందులోని విద్యుత్ ప్రభావం తక్కువగా ఉండి, బతికేందుకు అవకాశాలు ఉంటాయి. పిడుగు పడుతుందని అనిపించినప్పుడు రబ్బర్ చెప్పులు వేసుకోవడం మంచిది. ఒకవేళ వేసుకోలేని పరిస్థితి ఉన్నప్పుడు కాలును భూమి మీద పూర్తిగా ఆనించొద్దు. కాలి వేళ్ల మీద ఉండేందుకు ప్రయత్నించాలి.

విద్యుత్ పరికరాలకు నష్టం

పిడుగు పడినప్పుడు విద్యుత్ పరికరాలకు ఎక్కువ నష్టం వాటిల్లితుంది. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి. టీవీ, రిఫ్రిజిరేటర్, సెల్‌ఫోన్ వంటి వాటిని వినియోగించకపోవడం ఉత్తమం. మెరుపులు వస్తున్నప్పుడు ఆరుబయట స్నానం చేయడం, వంట పాత్రలు కడగడం చేయవద్దు. లోహపు వస్తువుల ద్వారా విద్యుత్ ప్రవహించే అవకాశాలు ఎక్కువ.

సూర్యుడికన్నా ఎక్కువ వేడి



సూర్యుడి ఉపరితలం మీద 5 వేల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటే, పిడుగు పడినప్పుడు 29 వేల డిగ్రీలు ఉత్పత్తి అవుతుంది. పిడుగుకు సూర్యుని ప్రభావం కన్నా ఐదురెట్లు ఎక్కువ వేడి ఉంటుంది.

– డాక్టర్ విజయలక్ష్మి, ప్రాథమి ఆరోగ్య కేంద్రం, షాబాద్

విద్యుత్ కనెక్షన్ తొలగించాలి



పిడుగుపాటుకు గురైన వ్యక్తిని ముట్టుకుంటే షాక్‌రాదు. వెంటనే బాధితుడికి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించాలి. పిడుగుల సమయంలో విద్యుత్ పరికరాల కనెక్షన్ తీసివేయడం మంచిది.

– కోటేశ్వర్‌రావు, విద్యుత్ ఏఈ, షాబాద్

జీవాలను చెట్ల కింద ఉంచొద్దు



ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్న సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. వాతావరణ పరిస్థితులను బట్టి వెంటనే అప్రమత్తం కావాలి. మూగజీవాలను చెట్ల కింద ఉంచొద్దు. రైతులు చెట్లకు దూరంగా ఉండాలి. సెల్‌ఫోన్‌లు వాడొద్దు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం.

– డాక్టర్ స్రవంతి, పశువైద్యాధికారి, షాబాద్

రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం

- ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీ రద్దు చేశాం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పేదల భూములు తీసుకుని రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం యాచారం మండల పరిధిలోని మల్కీజ్‌గూడ, ధర్మన్నగూడ, నందివనపర్తి గ్రామాల్లో రూ.75లక్షల విలువ చేసే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం నందివనపర్తిలో జ్యోతి ఎడ్యుకేటర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సంఘ సేవకులు సంగం సత్తయ్య విగ్రహ ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన మేరకు పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు రోజుల్లోనే ఫార్మా రద్దు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైతే మార్కెట్ ధర చెల్లించి రైతులను ఒప్పించాలని.. ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోమన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసమే ఫోర్త్ సిటీ తీసుకొచ్చామన్నారు. ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి వేల కోట్ల రూపాయలు పెట్టుబడులతో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం చేపడుతున్నమన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఈ ప్రాంతం అభివృద్ధిలో వెనకబడిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, నాయకులు శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, పాండురంగారెడ్డి, అమృతాసాగర్, ధనుంజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

కందుకూరు: మండల పరిధిలోని సార్లరావులపల్లిలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బంజార సేన రాష్ట్ర అధ్యక్షుడు జర్పుల ప్రవీణ్‌నాయక్, మాజీ సర్పంచ్ జర్పుల రజిత దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు దాసోజు శివప్రసాద్‌చార్యులు, నిరంజనాచార్యుల సమక్షంలో హోమాలు, ప్రత్యేక పూజల అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రజనీసాయిచంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథనాయక్; పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.మేఘునాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిర తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు భీమనాయక్, బాలునాయక్, నాగరాజు, శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు గోవర్ధన్‌నాయక్, జంగయ్య, దేవేందర్, సురేశ్, కొండల్‌రెడ్డి, డైరెక్టర్ ఆనంద్, నాయకులు ప్రకాష్‌రెడ్డి, జి.సామయ్య, కార్తీక్, బి.దీక్షిత్‌రెడ్డి, రవీందర్, నర్సింహ, వంశీ, శ్రీధర్ పాల్గొన్నారు.



ఆలయ నిర్వాహకులతో సబితారెడ్డి తదితరులు

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కేంద్రం



పాదయాత్రలో దప్పు కొడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

- సకలజనహితమే కాంగ్రెస్ లక్ష్యం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ.. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. పీసీసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణకు చేపట్టిన జైబాపు, జై సంవిధాన్ పాదయాత్ర ఆదివారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి, పుల్లేరుబోడ్ తండాల్లో కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పార్టీ నాయకులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు పార్టీ ఆధ్వర్యంలో జై సంవిధాన్ పాదయాత్ర చేపట్టామన్నారు. బీజేపీ వ్యవస్థలను నాశనం చేస్తోందని ఆరోపించారు. సకల జనహితమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం చేపడుతోన్న సంక్షేమాభివృద్ధి ప్రతిపక్ష పార్టీలకు మింగుడుపడడం లేదన్నారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎస్సీసెల్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు జగన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు హన్మానాయక్; యాదగిరిరెడ్డి, రామకృష్ణ, శంకర్, జగన్‌గౌడ్, జహంగీర్‌అలీ, సత్యం, సుమన్, కేశవులు, యాదగిరిరెడ్డి, వెంకటేశ్, నరేశ్‌నాయక్, షాబుద్దీన్, ఇమ్రాన్, జవహర్, యాదయ్య, రాజుగౌడ్, రాంచందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

నందిగామ: కుటుంబ సభ్యులతో గొడవపడిన వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని నర్సప్పగూడ గోవిందు పోచయ్య కాలనీలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన దేవేంద్రమాలిక్(40) రాధిక దంపతులు తమ ఇద్దరు కొడుకులతో కలిసి వలస వచ్చారు. అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఐదు నెలలుగా మద్యానికి అలవాటుపడిన దేవేంద్రమాలిక్ పనికి వెళ్లడం లేదు. ఈ విషయంలో దంపతులు శనివారం అర్ధరాత్రి గొడవపడ్డారు. దీంతో దేవేంద్రమాలిక్ కుటుంబసభ్యులను ఇంటి నుంచి బయటకు పంపి గదిలోని పైకప్పునకు ఉన్న ఇనుప పైపునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రాధిక మాలిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. కాగా ఈ మృతిపై స్థానికంగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

టీటైమ్ నిర్వాహకుడు..

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ యువకుడు చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ బ్లాక్ నెంబర్ 95/19లో నివాసముండే సుక్క రమేష్ కుమారుడు సుమన్ (22) నగరంలోని మాదాపూర్‌లో టీ టైమ్‌ను నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నమే ఇంటికి వచ్చిన సుమన్ తిరిగి మాదాపూర్‌కు వెళ్లలేదు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా చూసిన మృతుడి సోదరి రిషిత తన తండ్రికి ఫోన్‌లో సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా సుమన్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని కుటుంబసభ్యులు, పోలీసులు చెప్పారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ

షాబాద్: నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి గుర్తు తెలియని దుండగులు పుస్తెల తాడు లాక్కొని పారిపోయారు. ఈ ఘటన షాబాద్ ఠాణా పరిధి అస్పల్లిగూడ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన ప్రకారం.. షాద్‌నగర్ మండలం చౌలపల్లి గ్రామానికి చెందిన బోడ మాధవి కూతురు శ్రీవర్షిణి అస్పల్లిగూడ వద్ద బీసీ గురుకుల పాఠశాలలో చదువుతోంది. తన కూతురును చూసేందుకు బస్సు దిగి వెళ్తుండగా.. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఒకరు ఆమె వెంట నడుచుకుంటూ వెళ్లి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు లాక్కొని బైక్‌పై పారిపోయారు. ఈ క్రమంలో మాధవి మెడకు గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పల్ స్టేడియంలో సెల్‌ఫోన్ దొంగల చేతివాటం

ఉప్పల్: ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం అభిమానులు ఆనందంలో మునిగి తేలగా సెల్‌ఫోన్ దొంగలు చేతివాటం చూపించారు. స్టేడియం భద్రతలో దాదాపుగా 3 వేలకు పైగా పోలీసులు పహారా కాస్తున్నా వారిని లెక్క చేయకుండా సెల్‌ఫోన్ దొంగలు హల్‌చల్ సృష్టించారు. వందలాది సెల్ ఫోన్‌లను దొంగిలించడంతో బాధితులు లబోదిబో మంటూ ఉప్పల్ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. హైదరాబాద్ సన్ రైజర్స్ ఆటగాడు అభిషేక్ శర్మ పరుగుల వరద సృష్టించిన ఆనందంలో ప్రేక్షకులుండగా..దొంగలు చేతి వాటం చూపించినట్లు తెలిసింది. ఐపీఎల్ చరిత్రలోనే ఇంతగా సెల్‌ఫోన్లు దొంగిలించిన సంఘటన బహుషా ఇదే మొదటి సారి కావచ్చంటున్నారు. ఈ విషయంలో ఉప్పల్ సిఐ ఎలక్షన్ రెడ్డిని వివరణ కోరగా దాదాపుగా 15 నుంచి 20 మంది మాత్రం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మొక్కజొన్న ఉత్తమ హైబ్రీడ్ రకాల విడుదల

- ఆవిష్కరించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం
- అధిక దిగుబడితోపాటు రైతులకు ఎంతో మేలు చేసే రకాలు
- ఏజీ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య





ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన ఐదు ఉత్తమ హైబ్రిడ్ మొక్క జొన్న రకాలను విడుదల చేసింది. భారత వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో ఇటీవల తమిళనాడులో నిర్వహించిన అఖిల భారత మొక్కజొన్న పరిశోధన సమన్వయ సమావేశంలో విడుదల చేశారు.

హైబ్రిడ్ మొక్క జొన్న రకాలు ఇవీ...

వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన ఉత్తమ హైబ్రిడ్ మొక్కజొన్న రకాలు దక్కన్ హైబ్రిడ్ మక్క 144, ఈహెచ్‌ఎం 182, డీహెచ్‌ఎం193, డీహెచ్‌ఎం 206, డీహెచ్‌ఎం218లో కలిపి ఈ విశ్వవిద్యాలయం నుంచి మొత్తం 24 మొక్కజొన్న హైబ్రిడ్ రకాలు విడుదల అయ్యాయి. ఇందులో డీహెచ్‌ఎం 144 (తెలంగాణ మక్క–6) రకంలో అధిక పిండి పదార్థాలు ఉండటం వలన ఇథనాల్ ఉత్పత్తికి బాగా అనుకూలంగా ఉంటుందని విశ్వవిద్యాలయం అధికారులు వెల్లడించారు. దీంతో పాటు డీహెచ్‌ఎం 206 (తెలంగాణ మక్క–3) మెట్ట సాగుకు అనుకూలమైనదని తెలిపారు. ఎండ తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుందన్నారు. ప్రస్తుతం రైతాంగానికి అందుబాటులో ఉన్న వివిధ మొక్కజొన్న వంగడాలతో పోల్చితే డీహెచ్‌ఎం అన్ని విధాలా మేలైందని వారు స్పష్టం చేశారు. పరిశోధనలో రాబోయే కాలంలో రైతాంగం వినియోగించుకోవలసిందిగా విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

16 పంట రకాలకు కేంద్రం గుర్తింపు

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కాలంలో విడుదల చేసిన 16 రకాల వివిధ పంటలను ఇటీవల కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖలో జరిగిన సమీక్ష సమావేశంలో అధికారిక ప్రకటిత రకాలుగా (నోటిఫైడ్ వెరైటీస్) గుర్తిస్తూ ప్రకటన విడుదల చేసింది. జయశంకర్ విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఆయా పంట రకాలను కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖ విత్తనోత్పత్తి ప్రణాళికలు రూపొందించి ఈ రకాలను రైతాంగానికి అందుబాటులోనికి తెవడానికి సహకరిస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ విత్తన సంస్థలు ఈ రకాల మూల విత్తన సరఫరాకు ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

మేలు రకాలను గుర్తించాలి



రైతులకు తక్కువ పెట్టుబడిలో అధిక దిగుబడులు రావడం తక్కువ నీటితో పంట సాగయ్యేలా వంగడాలను తీసుకొచ్చేందుకు విశ్వవిద్యాలయంలో నిరంతరం కృషి చేస్తున్నాం. ఇందుకోసం వర్సిటీ శాస్త్రవేత్తలు తాము చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. ఇప్పటి వరకు చాలా వరి వంగడాలను తీసుకొచ్చాం. ఇప్పుడు మొక్కజొన్న డీహెచ్‌ఎం చాలా మంచి రకాలు. ఇందులో 6 రకాలు మంచి దిగుబడి ఇస్తాయి. రైతులు ఈ విషయాలను గుర్తించి ఆయా రకాలను సాగు చేస్తుకోవాలి. ఇవి మెట్ట సాగుకు చాలా అనుకూలం. నీరు తక్కువగా ఉన్నా సాగు చేసుకోవచ్చు.

– అల్దాస్ జానయ్య, ఉప కులపతి, పీజేటీఎస్‌యూ